



RNI NO. TELTEL/2014/61071

# జన తెలంగాణ

తెలుగు దిన పత్రిక

PUBLISHED PROM:HYDARABAD,KARIMNAGAR,KAMMAM,V IZAYAWADA,KADAPA,THIRUPATHI

సంపుటి : 14 సంచిక :104 | శనివారం ఆగస్ట్ 08, 2026 | ఎడిటర్ - ఆర్. చైతన్య | పేజీలు 6 | వెల-5


## నరుడికి నాగరికత నేర్పింది నేతన్నే

- ప్రజా ప్రభుత్వంలో చేనేతకు మరింత గౌరవం.. నేతన్నలకు మరింత భరోసా
- చేనేతను ఆదరిస్తే నేతన్న కుటుంబాలకు అండగా నిలిచినట్లే
- వారం లో కనీసం రెండు రోజులైనా చేనేత వస్త్రాలు ధరించాలి



2లో

## విస్తారంగా వర్షాలు కురవాలని వరుణ యాగం..

సీఎం రేవంత్ నిర్ణయం

- విస్తారంగా వర్షాలు కురవాలని వరుణ యాగం
- ఈనెల 10న నాగార్జునసాగర్‌లో వరుణ యాగం
- విజయ విహార్ ప్రాంగణంలో యాగం నిర్వహణ



- యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో కార్యక్రమం
- దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో యాగక్రతువులు

హైదరాబాద్: రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ వరుణ యాగం నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం అర్చకులు, వేదపండితులు నిర్ణయించిన ముహూర్తం మేరకు ఈనెల 10న నాగార్జునసాగర్‌లో ఈ యాగం నిర్వహించనున్నారు. సాగర్ తీరంలోని విజయ విహార్ ప్రాంగణంలో దీనికి సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు.

దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అర్చకులు యాగక్రతువులు నిర్వహించనున్నారు. కృష్ణా-గోదావరి నదులు, చెరువులు జలకళ సంతరించుకోవాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలనే సంకల్పంతో ప్రత్యేక పూజలు చేయనున్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సారథ్యంలో వరుణ యాగం జరగనుందని తెలంగాణ సీఎం కార్యాలయం తెలిపింది. యాగం అనంతరం నిర్వహించే పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొంటారని పేర్కొంది.

## భారత్-చైనా అధికారుల భేటీ..

కేంద్రం స్పందన ఇదే..



- వాస్తవాధీన రేఖ వెంబడి పరిస్థితిపై సమీక్ష.
- సరిహద్దు ప్రాంతాల్లోని నదుల డేటా షేరింగ్‌పై చర్చ.
- భారత్--చైనా మధ్య అపరిష్కృతంగా ఉన్న సరిహద్దు సమస్యలపై సంప్రదింపులు.
- అన్ని అంశాలపై స్పష్టంగా చర్చించినట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది.
- గల్వాన్ ఘర్షణ తర్వాత దెబ్బతిన్న ద్వైపాక్షిక సంబంధాల్లో ఇటీవల కొంత సానుకూల వాతావరణం కనిపిస్తోంది.

సరిహద్దు సహా ఇతర విషయాల్లో ఉన్న అపోహలను తొలగించుకునేందుకు భారత్-చైనా అధికారులు సమావేశమయ్యారు. ఈ అంశాలపై సంప్రదింపులు, సమన్వయం కోసం ఏర్పాటైన యంత్రాంగం 36వ భేటీ దిల్లీలో జరిగింది. సరిహద్దులో ఉన్న నదుల డేటా షేరింగ్ తదితర అంశాలపై చర్చించారు. ఈ భేటీపై విదేశాంగ శాఖ సందిస్తూ.. "అన్ని అంశాలపై స్పష్టంగా చర్చించాం. వాస్తవాధీన రేఖ వెంబడి పరిస్థితిపై సమీక్ష జరిగింది" అని పేర్కొంది.

అపరిష్కృతంగా ఉన్న సరిహద్దు సమస్యలు దశాబ్దాలుగా భారత్-చైనా మధ్య తీవ్ర అపనమ్మకానికి కారణమవుతున్నాయి. గల్వాన్ ఘర్షణతో రెండు దేశాల సంబంధాలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. ఇటీవల కాస్త సానుకూల వాతావరణం కనిపిస్తోంది. కొన్నినెలల క్రితం షాంఘై సదస్సు కోసం ప్రధాని మోదీ చైనాలో పర్యటించగా.. బ్రిక్స్ సమ్మిట్ కోసం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్ వస్తారని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఔవీజజ సమావేశం జరిగింది.

## త్వరలో డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్...




2లో

## బోనాల పండగతో 9న మద్యం దుకాణాల మూసివేత




మందుబాబులకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేశ్ షాక్ ఇచ్చారు. బోనాల పండుగ సందర్భంగా ఆగస్టు 9న మద్యం దుకాణాలను మూసివేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ రోజు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు వైన్ షాపులు, కల్లు దుకాణాలు, బార్లు మూసివేయాలని సీపీ రమేశ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. కూకట్‌పల్లి, అల్లాపూర్, రాయదుర్గం, జీడిమెట్ల, మేడ్చల్, చందానగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని సీపీ రమేశ్ పేర్కొన్నారు.

రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లకూ ఈ ఆదేశాలు వర్తిస్తాయని ఆయన తెలిపారు. అయితే స్టార్ హోటళ్లలోని బార్లు, రిజిస్టర్డ్ క్లబ్‌లలోని బార్లకు మినహాయింపు ఉంటుందని వెల్లడించారు. ప్రజా శాంతి, భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బోనాల వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీపీ రమేశ్ పేర్కొన్నారు.

## ఏపీ అభివృద్ధిలో సీఏల పాత్ర అత్యంత కీలకం:

మంత్రి పయ్యావుల



అమరావతి: రాష్ట్ర అభివృద్ధిలో ఛార్టెడ్ అకౌంటెంట్ల పాత్ర అత్యంత కీలకమని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. మంగళగిరిలో నిర్వహించిన 'ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా' సదస్సులో ఆయన మాట్లాడారు. పారదర్శక ఆర్థిక వ్యవస్థ, సమర్థమైన పన్నుల నిర్వహణ, పెట్టుబడుల ఆకర్షణ, సుస్థిర అభివృద్ధికి సీఏల సేవలు అవసరమన్నారు. పేజి 2లో ▶

## జీఐ ట్యాగ్‌తో కుప్పడం పట్టుకు గుర్తింపు

కుప్పడం పట్టుకు జీఐ ట్యాగ్ విశిష్టత

- చీరాలలో 'నేతన్న సేవలో' పథకం ప్రారంభం
- చేనేత కార్మికులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి
- ఉచిత విద్యుత్, రూ.25 వేల సాయంపై సంతోషం
- ఉపాధి అవకాశాల విస్తరణపై చర్చలు

పేజి 2లో ▶



# చేనేత సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

- పీపుల్స్ ప్లాజాలో చేనేత ప్రదర్శన ప్రారంభం
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి

హైదరాబాద్తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. పీపుల్స్ ప్లాజాలో 100కు పైగా చేనేత స్టాల్స్ ప్రారంభించినట్లు తెలిపారు. ఆగస్టు 7 నుంచి 16 వరకు చేనేత వస్త్ర ప్రదర్శన కొనసాగుతుందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కార గ్రహీతలను సత్కరిస్తామని చెప్పారు. చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, వారసత్వానికి చేనేత ప్రతీకన్నారు. గద్వాల, పోచంపల్లి, నారాయణపేట చేనేతకు ప్రపంచస్థాయిలో గుర్తింపు ఉందని మంత్రి తెలిపారు.

పేజి 2లో ▶



## విజయ డెయిరీ ఛైర్మన్ పదవికి చలసాని ఆంజనేయులు రాజీనామా



2లో

- పార్టీ అధిష్ఠానం నిర్ణయాన్ని గౌరవిస్తూ ఆయన ఆ పదవి నుంచి వైదొలిగారు.

## జీహెచ్ఎంసీ ఎన్నికల్లో భాజపా ఒంటరిగా పోటీ:



దిల్లీ: జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తులు ఉండవని భాజపా తెలంగాణ చీఫ్ రామచందర్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో పార్టీ నేతల మధ్య విభేదాలు లేవని.. భేదాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయన్నారు. దిల్లీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో భేటీ అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు.

పేజి 2లో ▶

RNI NO. TELTEL/2014/61071
జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక
శనివారం ఆగస్ట్ 08, 2026

# సంపాదకీయం

## కాక్రోచ్ కదన కుతూహలమేమిటి?

నమ్మశక్యం కాని విషయాలు అప్పుడప్పుడు వాస్తవాలుగా పరిణమించడం భారతదేశ విలక్షణత. తమ చుట్టూ ఉన్న సమాజాన్ని మార్చివేయాలని అనునిత్యం అనేకానేక మంది ఆకాంక్షిస్తుంటారు. స్వప్న సాధకులు ఎంతమంది? అరుదు, చాలా అరుదు. కనుకనే ఉద్యమ భారతంలో 30 ఏళ్ల యువకుడు అభిజిత్ దీప్కే సాఫల్యాన్ని ఒక అసాధారణ విజయంగా మనం భావించి తీరాలి.

'కాక్రోచ్‌లు సంఘటితమవ్వాలి' అని మే 16న విజ్ఞప్తి చేసిన ఒక ట్వీట్ దేశవ్యాప్తంగా యువజనుల నిరసనోద్యమంగా ప్రజ్వరిల్లి అంతిమంగా ఒక కేంద్రమంత్రి రాజీనామాకు దారితీస్తుందని ఎవరు ఊహించారు? ఈ దేశంలో, నెల రోజుల క్రితం దీప్కే గురించి విన్నవారు ఎంతమంది? ఆయన ఏర్పాటు చేసిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)ని పట్టించుకున్నవారెంతమంది? మరి నేడు శంభాజీనగర్‌లోని దీప్కే నివాసం ఎదుట వందలాది టీవీ చానెళ్ల రిపోర్టర్లు, యూట్యూబర్లు, సీనియర్ రాజకీయ నాయకులు బారులు తీరుతున్నారు. ఆన్‌లైన్ ఫ్యాడ్‌గా అనేకమంది కొట్టిపారేసిన ఉదంతమే అనూహ్యంగా ఈ ఏడాది అతిపెద్ద రాజకీయ సంఘటనగా నిలిచింది.

ఉద్యమ తక్షణ లక్ష్యం నెరవేరింది. అసలు సవాల్ ఇప్పుడే మొదలయింది. కాక్రోచ్ జనతా పార్టీ ఇప్పుడు ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే స్వతంత్ర బృందం (ప్రెజర్ గ్రూప్)గా ఉండిపోతుందా? లేక, ఎన్నికల రాజకీయాలలోకి దూకుతుందా? ఈ విషయమై దీప్కేను ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ప్రశ్నించాను (సామాజిక మాధ్యమాలలో అనేకమంది సైతం ఇదే ప్రశ్న అడుగుతున్నారు).. నా ప్రశ్నకు దీప్కే వెన్వెంటనే ఇలా సమాధానమిచ్చారు: 'సీజేపీని ఒక రాజకీయపార్టీగా మార్చే విషయం గురించి మేము ఆలోచించనే లేదు. ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకుల జవాబుదారీతనాన్ని డిమాండ్ చేసే నిరసనోద్యమంగా మాత్రమే ఉండిపోవాలని మేము భావిస్తున్నాము'.

ఇటువంటి మాటలనే ఇండియా ఇంతకు ముందూ విన్నది. 2011లో అవినీతి నిర్మూలనోద్యమం ఉధృతంగా కొనసాగుతున్నప్పుడు రాజకీయాలలోకి ప్రవేశించే ఉద్దేశం తనకు ఎంతమాత్రం లేదని అరవింద్ కేజ్రీవాల్ పదే పదే ఉద్ఘాటించారు. రెండు సంవత్సరాల అనంతరం ఢిల్లీ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించింది ఆయనే కాదూ? విజయవంతమైన ప్రతి నిరసనోద్యమమూ అంతిమంగా ఒకే విధమైన సందిగ్ధావస్థ నెదుర్కోవటం కద్దు: నైతిక పలుకుబడిని రాజకీయ అధికారంగా మార్చుకోవడం ఎలా? ఈ సంకట పరిస్థితిని చాలా మంది కంటే దీప్కే మెరుగ్గా అర్థం చేసుకున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీతో పనిచేసిన అనుభవం దీప్కేకు ఉన్నది. ప్రజాగ్రహాన్ని ఎన్నికల విజయంగా ఎలా మార్చుకోవచ్చో ఆప్ నిరూపించింది. ఉద్యమ సాఫల్యంతో సమకూరిన నైతిక అధికారాన్ని, పోటీ రాజకీయాలలోకి ప్రవేశించిన తరువాత నిలబెట్టుకోవడం ఎంత కష్టమో అన్నదానికి కూడా ఆ పార్టీ ఒక దృష్టాంతం అయింది. ఎన్నికల రాజకీయాలలోకి దిగిన తరువాత పొత్తులు, రాజీలు, సంస్థాగత ఒత్తిళ్లు అనివార్యం కదా.

వ్యవస్థపై ప్రజాగ్రహం మాత్రమే కాకుండా మరెన్నో అంశాలు కలిసివస్తేనే మౌలిక రాజకీయ మార్పును సాధించడం సాధ్యమవుతుంది. చరిత్ర సూచిస్తున్న సత్యమిది. సరైన సమయంలో సరైన నాయకుడు రంగంలో ఉండడం చాలా ముఖ్యం. అంతకంటే ముఖ్యంగా అతడి ప్రాభవ ప్రాబల్యాలకు ఒక స్పష్టమైన సామాజిక మద్దతు ఉండి తీరాలి. కేజ్రీవాల్ కేవలం అవినీతి నిర్మూలనోద్యమం ఆధారంగా ఢిల్లీ అధికారాన్ని కైవసం చేసుకోలేదు. అంతకంతకూ విస్తరిస్తోన్న పట్టణ మధ్యతరగతి వర్గానికి ఆయన రాజకీయ గొంతుక అయ్యారు. ఆ విస్తృత సామాజికవర్గం ఆలంబనతోనే కేజ్రీవాల్ తన అధికారోన్నతికి సోపానాలు నిర్మించుకున్నారు. తమిళనాడులో ఈ ఏడాది అసాధారణ రాజకీయ విజయం సాధించిన జోసెఫ్ విజయ్ కథ కూడా విశిష్టమైనది. సినీనటుడు అయిన విజయ్, తమిళ సమాజానికి విలక్షణమైన సినిమా సంస్కృతి, రాజకీయాలను కలగలిపి అద్భుత విజయాన్ని అందుకున్నారు. ద్రావిడ పార్టీల దశాబ్దాల ప్రాబల్యాన్ని ఎదుర్కొనేందుకు ఆయన ప్రధానంగా యువతరంపై ఆధారపడ్డారు. సంప్రదాయ కుల, వర్గ అంతరాలకు అతీతంగా యువ ఓటర్లు విజయ్ పట్ల ఆకర్షితులయ్యారు. ఆయనకు అద్వితీయ విజయాన్ని అందించారు.

ప్రజల ధర్మాగ్రహం ఒక ఉద్యమాన్ని ప్రజ్వలింప జేయవచ్చు. అయితే అది అరుదుగా మాత్రమే ఎన్నికల సవాళ్లను సమర్థంగా ఎదుర్కోగలుగుతుంది. కాక్రోచ్ జనతా పార్టీ కీలక మద్దతుదారులు ఎవరు? ప్రశ్న పత్రాల లీక్‌లపై ఆగ్రహిస్తోన్న జెన్ జీ విద్యార్థులా? ఉద్యోగాన్వేషణలో వేసారుతున్న నిరుద్యోగ పట్టభద్రులా? భారత్ అనుపమానంగా సాధిస్తున్న అభివృద్ధిలో తమకు సముచిత రీతిలో వాటా లభించడం లేదని ఆగ్రహిస్తున్న దిగువ మధ్యతరగతి ప్రజలా? కొత్త రాజకీయ వ్యూహాలకు ప్రయత్నిస్తున్న అంబేడ్కర్ వాదులా? అధికారంలో ఏ పార్టీ ఉన్నా ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించడంలేదని ఆగ్రహిస్తున్న ముప్పై ఏళ్ల లోపు వయసు ఉన్న నవ యువతరమా? ఈ ప్రశ్నలకు సమాధానం లభించనంతవరకు ఏ నిరసనోద్యమాన్ని అయినా సరే ఒక ఎన్నికల శక్తిగా మార్చడమనేది చాలా కష్టసాధ్యమవుతుంది.

సీజేపీ విషయంలో మరో కారణం కూడా ఉన్నది. 2013లో ఢిల్లీలో, 2026లో తమిళనాడులో ఉన్న రాజకీయ పరిస్థితులకు నేటి జాతీయ రాజకీయ దృశ్యం పూర్తిగా భిన్నమైనది. ఇప్పుడు భారతీయ జనతా పార్టీ భారతదేశ ప్రధాన ఎన్నికల శక్తిగా వర్ధిల్లుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీర్తి చంద్రికలు కించిత్ మసకబారి ఉండవచ్చు గానీ ఆయన ఇప్పటికీ శిఖర సమానుడు. ఒక అజేయశక్తిగా వెలుగొందుతున్నారు. కేంద్ర కేబినెట్ మంత్రి రాజీనామాను అనివార్యం చేయడం విశిష్ట రాజకీయ విజయమే, సందేహం లేదు. అయితే మహాశక్తిమంతమైన బీజేపీ ఎన్నికల యంత్రాంగాన్ని ఓడించడం పూర్తిగా భిన్నమైన విషయం. అదంత తేలికైన వ్యవహారం కాదు.

నిజానికి సీజేపీ బలం, ప్రభావశీలత అంతా కచ్చితంగా అది మరొక రాజకీయ పార్టీ కాకపోవడంలోనే ఉన్నది. సీజేపీ నిర్వహించిన జంతర్ మంతర్ ఆందోళన భారతీయ యువజనులను చైతన్యపరచడమే కాదు, సమస్త భారతీయుల మనసులపై చెరగని ముద్ర వేసింది. సంప్రదాయ పక్షపాత రాజకీయాలకు అతీతంగా ఒక విశాల ఆదర్శాన్ని అది ఆలంబనగా చేసుకున్నది. వ్యవస్థ పట్ల తమ అసంతృప్తిని, ఆగ్రహావేశాలను వ్యక్తం చేసేందుకు యువజనులకు అది ఒక వేదికను సమకూర్చింది. నీట్ ప్రశ్నపత్రాల లీక్ అందుకు తక్షణ ప్రేరణ అయినప్పటికీ తగ్గిపోతున్న అవకాశాలు, పెరుగుతున్న అసమానతలు, సామాన్య ప్రజల సమస్యల పట్ల ప్రభుత్వాల ప్రతిస్పందనా రాహిత్యం మొదలైన వాటి పట్ల యువజనులలో లోతుగా గూడుకట్టుకున్న ఆవేదనలు, ఆందోళనల కారణంగానే సీజేపీ ఉద్యమం విస్తృతంగా ప్రతిధ్వనించింది, ప్రజల మద్దతును పొందింది.

నైతిక పలుకుబడి చాలా విలువైనది. దానిని ఒకసారి కోల్పోతే తిరిగి పొందడమనేది అరుదుగా మాత్రమే సాధ్యమవుతుంది. ఒక ఉద్యమం ఎన్నికల రాజకీయాలలోకి ప్రవేశించిన క్షణమే ప్రతి నిర్ణయమూ ఏదో ఒక రీతిలో రాజీపడి తీసుకున్నదే అవుతుంది. ఉద్యమకారుడు క్రమంగా, తాను ఒకప్పుడు సవాల్ చేసిన వ్యవస్థలోనే భాగస్వామి అవుతాడు. బహుశా ఈ కారణంగానే సీజేపీ సదా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే స్వతంత్ర బృందంగా ఉండిపోవాలన్నది అభిజిత్ దీప్కే స్వాభావిక వైఖరిగా ఉన్నది. ఇది, కనీసం ప్రస్తుతానికి వివేకవంతమైన మార్గం. ఉద్యమించవలసిన సమస్యలా?-- నిరుద్యోగం, ప్రశ్న పత్రాల లీక్, విఫలమవుతున్న ప్రభుత్వ విద్యా వ్యవస్థలు, పోలీసు సంస్కరణలు, పర్యావరణ విధ్వంసం, వ్యవసాయరంగంలో నిత్య సంక్షోభం, బడుగు, బలహీన వర్గాల జీవన అవస్థలు... మొదలైనవి అనంతంగా ఉన్నాయి. ఈ సమస్యలను జరూరుగా పరిష్కరించవలసి ఉన్నదన్న విషయమై అన్ని పార్టీల మధ్య ఏకీభావం ఉన్నది. కనుక సీజేపీ ఈ సమస్యలపై ఉద్యమించాలి. ఏదో ఒక రాజకీయ పక్షం తరఫున లేదా భావజాలానికి అనుగుణంగా వ్యవహరించడానికి బదులుగా ఆ సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి ప్రభుత్వమూ పూచీ వహించేలా సీజేపీ తన స్వతంత్ర గళాన్ని వినిపించాలి.

# త్వరలో డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్...

మొదటిపేజీ తరువాయి

**పౌరుల డేటా భద్రతకు బ్లాక్‌చెయిన్ ఆధారిత సర్టిఫికెట్ల జారీ**

**రాష్ట్రంలోని అన్ని గ్రామీణ ప్రాంతాలకు హై-స్పీడ్ డిజిటల్ కనెక్టివిటీ**

**"ఏఐ ట్రాన్స్ఫర్మేషన్ కాంక్లేవ్ (తెలంగాణ)"లో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి**

త్వరలోనే రాష్ట్రంలో 'డిజిటల్ అసెంబ్లీ', 'డిజిటల్ కౌన్సిల్'ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పౌర సేవల్ని మరింత సమర్థవంతంగా... ప్రజల ముంగిటకే చేర్చేలా ఏఐ, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, డేటా అనలిటిక్స్, క్వాంటం కంప్యూటింగ్ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీలకు పాలనలో పెద్ద పీట వేస్తున్నామన్నారు. గవ్ కనెక్ట్ (+హాఎషీఅఅవమ్), ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ (మీసేవ) సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం బేగంపేటలోని ఐటీసీ కాకతీయలో నిర్వహించిన "ఏఐ ట్రాన్స్ఫర్మేషన్ కాంక్లేవ్ (తెలంగాణ)"ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాలనలోనూ మార్పులు రావాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. డిజిటల్ క్యాబినెట్, 20 ప్రభుత్వ శాఖలను ఒకే తాటిపైకి తెచ్చేలా రియల్ టైమ్ గవర్నమెంట్ డ్యాష్ బోర్డు, దేశంలోనే తొలి ఏఐ ఆధారిత డేటా ఎక్స్ఛేంజ్, వాట్సాప్ ద్వారా పౌర సేవల డెలివరీ, మీ టికెట్ లాంటి ఎన్నో విప్లవాత్మక సంస్కరణల ద్వారా డిజిటల్ గవర్నెన్స్‌లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిపామన్నారు. పౌరుల డేటా భద్రతకు పెద్దపీట వేసేలా త్వరలోనే బ్లాక్‌చెయిన్ ఆధారిత సర్టిఫికెట్ల జారీకి శ్రీకారం చుడతామన్నారు.

రాష్ట్రంలోని అన్ని గ్రామీణ ప్రాంతాలకు టీ ఫైబర్ ద్వారా హై-స్పీడ్ డిజిటల్ కనెక్టివిటీని అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ పౌర సేవలను నేరుగా వారి ఇంటి ముంగిటకే అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. డిజిటల్ ఆఫీస్ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ పూర్తిస్థాయిలో పేపర్‌లెస్ అడ్మినిస్ట్రేషన్‌ను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మహారాష్ట్ర సీఎంవో చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్, మిత్రా సీఈవో ప్రవీణ్ పరదేశి, సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఎండీ జీవీఎల్ సత్య కుమార్, నేషనల్ ఇంటర్నెట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా సీఈవో డా. దేవేష్ త్యాగి, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ అడిషనల్ సెక్రటరీ సౌరభ్ కె. తివారీ తదితరులు పాల్గొన్నారు.

# నరుడికి నాగరికత నేర్పింది నేతన్నే

మొదటిపేజీ తరువాయి

చేనేత రంగానికి మరింత గౌరవం, నేతన్నలకు నిరంతర ఉపాధి, చేనేత ఉత్పత్తులకు మరింత మార్కెట్ కల్పించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క అన్నారు. వ్యవసాయం, చేనేత రంగాలు తమ ప్రభుత్వానికి రెండు కళ్ల వంటివని ఆమె పేర్కొన్నారు. చేనేత కార్మికుల కష్టానికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు.

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న చేనేత వేడుకలకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర చేనేత అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దూడెం వెంకటరమణ, మాజీ ఎంపీ గుండు సుధారాణి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, చేనేత కళాకారులు పాల్గొన్నారు.

పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన చేనేత ఎగ్జిబిషన్‌ను మంత్రి సీతక్క ప్రారంభించారు. వివిధ ప్రాంతాలకు చెందిన నేతన్నలు తయారు చేసిన చేనేత చీరలు, వస్త్రాలను ఆమె పరిశీలించారు. స్వయంగా మగ్గం నేసి నేతన్నల నైపుణ్యాన్ని తెలుసుకున్నారు. చేనేత చీరలను కొనుగోలు చేసి, ప్రజలు కూడా చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయాలని పిలుపునిచ్చారు. చేనేత కళాకారులు, ప్రముఖులను శాలువాలతో సత్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులకు, ముఖ్యంగా తెలంగాణ నేతన్నలు, నేతమ్మలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయం తర్వాత అధికంగా కష్టపడేది నేతన్నలేనని అన్నారు. ఒక చీర వెనుక కేవలం నూలుపోగులు మాత్రమే ఉండవని, ఒక కుటుంబం ఆశ, నేతన్న నైపుణ్యం, తరతరాలుగా వస్తున్న సంప్రదాయం ఉంటుందని చెప్పారు.

నరుడికి నాగరికత నేర్పింది నేతన్నలేనని మంత్రి సీతక్క అన్నారు. మనిషి వస్త్రాన్ని నేయడం, ధరించడం ప్రారంభించినప్పుడే నాగరిక సమాజానికి నాంది పడిందని తెలిపారు. నేతన్న నూలుపోగు మన నాగరికతకు చిహ్నమని, చేనేత కేవలం ఒక వృత్తి కాదని, అది మన సంస్కృతికి ప్రతీక, సంప్రదాయానికి చిరునామా అని పేర్కొన్నారు.

చేనేత రంగాన్ని కేవలం సంక్షేమ కోణంలో కాకుండా ఉపాధి, ఆర్థికాభివృద్ధి, సాంస్కృతిక పరిరక్షణ కోణంలో ప్రభుత్వం చూస్తోందన్నారు. నేతన్నల కష్టం వృథా కాకుండా నిరంతర ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

ప్రతి సంవత్సరం కోట్ల రూపాయల విలువైన ఇందిరమ్మ చీరల ఆర్డర్లను చేనేత కార్మికులకు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. దీంతో వేలాది నేత కుటుంబాలకు ఏడాది పొడవునా ఉపాధి లభిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్‌లకు అవసరమైన వస్త్రాన్ని కూడా చేనేత కార్మికుల నుంచే కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఏడాది కోట్ల మీటర్ల వస్త్రాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడం ద్వారా చేనేత రంగానికి బలమైన మార్కెట్ కల్పిస్తున్నామని తెలిపారు.

గతంలో పేరుకుపోయిన నేతన్నల బకాయిలను కూడా తమ ప్రభుత్వం విడతల వారీగా చెల్లిస్తోందని సీతక్క చెప్పారు. చేనేత రంగం అభివృద్ధి, సంక్షేమం కోసం ఇప్పటికే సుమారు రూ.1,300 కోట్ల నిధులను ప్రభుత్వం వెచ్చించిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేనేతకు మరింత గౌరవం, మార్కెట్, భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

నేతన్నల చేతుల్లో నూలు చక్రం నిరంతరం తిరిగితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని మంత్రి అన్నారు. చేనేత బతికితే వేలాది కుటుంబాలు బతుకుతాయని పేర్కొన్నారు. ప్రజలంతా చేనేతకు తమ వంతు మద్దతు ఇవ్వాలని కోరారు. వారం లో కనీసం రెండు రోజులైనా చేనేత వస్త్రాలు ధరించాలని మంత్రి సీతక్క ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తాను కూడా చేనేత దుస్తులు ధరించడానికి ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. పండుగలు, శుభకార్యాలు, ప్రత్యేక సందర్భాల్లో కనీసం ఒక చేనేత వస్త్రాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. ఒక చేనేత వస్త్రాన్ని కొనుగోలు చేయడం అంటే ఒక నేత కుటుంబానికి అండగా నిలవడమేనని అన్నారు.

చేనేతను ఆదరించడం అంటే మన సంస్కృతిని గౌరవించడమేనని, నేతన్నలను ప్రోత్సహించడం అంటే గ్రామీణ భారతాన్ని బలోపేతం చేయడమేనని మంత్రి సీతక్క అన్నారు. అందరం చేనేతను ఆదరించి నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపాలని పిలుపునిచ్చారు.

## ఏపీ అభివృద్ధిలో సీఏల పాత్ర అత్యంత కీలకం:

మొదటిపేజీ తరువాయి

డిజిటల్ యుగానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని యువ సీఏలు దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని తెలిపారు. దేశంలో తమకు 191 బ్రాంచీలు ఉన్నాయని ఐసీఐఏ అధ్యక్షులు ప్రసన్నకుమార్ చెప్పారు. ప్రభుత్వం భూమి ఇస్తే రాజధానిలో తమ శాఖ ఏర్పాటు చేసేందుకు సిద్ధమని ఆయన పేర్కొన్నారు. అమరావతిలో రాబోయే 50 ఏళ్లకు సరిపోయే మౌలిక వసతులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ఇంత మంచి నగరంలో తాము శాఖను ఏర్పాటు చేసుకోవడం ఎంతో అవసరం అని ప్రసన్నకుమార్ తెలిపారు.

## చేనేత సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

మొదటిపేజీ తరువాయి



చేనేత కార్మికుల జియో ట్యాగింగ్‌లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు. ఎఎఊఈ ద్వారా యువతకు ఆధునిక చేనేత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 'నేతన్న భరోసా' కింద ఏడాదికి రూ.18 వేల ఆర్థిక సాయం అందజేస్తున్నామని, 'నేతన్నకు భద్రత' పథకంలో రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. చేనేత రుణమాఫీకి రూ.49.27 కోట్లు విడుదల చేశామన్నారు. చేనేత రంగానికి మొత్తం రూ.980 కోట్లు ప్రభుత్వ విడుదల చేసినట్లు చెప్పారు. వేములవాడ యార్న్ డిపో ద్వారా 3096 మెట్రిక్ టన్నుల నూలు సరఫరా అవుతోందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహిస్తామన్నారు. రైతన్నకు, నేతన్నకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## విజయ డెయిరీ ఛైర్మన్ పదవికి చలసాని ఆంజనేయులు రాజీనామా

మొదటిపేజీ తరువాయి

విజయవాడ: విజయ డెయిరీ ఛైర్మన్ పదవికి తెదేపా నేత చలసాని ఆంజనేయులు రాజీనామా చేశారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయాన్ని గౌరవిస్తూ ఆయన ఆ పదవి నుంచి వైదొలిగారు. ఈ సందర్భంగా చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ.. పార్టీ నిర్ణయం తనకు శిరోధార్యమన్నారు. మరొకరికి ఛైర్మన్‌గా అవకాశం కల్పించాలనే ఉద్దేశంతోనే చలసాని రాజీనామా చేశారని మంత్రి పార్థసారథి తెలిపారు. తనకు పార్టీ ముఖ్యమని.. పదవులు కాదని ఆయన చెప్పారన్నారు.

చలసాని ఆంజనేయులు పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా నామినేషన్ వేయడంపై తెదేపా అధిష్ఠానం ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఛైర్మన్ పదవిపై ఆలోచించి నిర్ణయం తీసుకుందామని, నామినేషన్ వేయొద్దని సూచించింది. గురువారం ఉదయం వరకూ ఉపసంహరించుకుంటానని చెబుతూనే ఎన్నికల ప్రక్రియలో చలసాని ముందుకెళ్లడంతో మంత్రులు కొల్లు రవీంద్ర, పార్థసారథి ఆయన్ను కలిశారు. పార్టీ నిర్ణయానికి అతీతంగా వెళ్లొద్దని సూచించారు. పార్టీ కావాలో.. పదవి కావాలో నిర్ణయించుకోవాలని అధిష్ఠానం మాటగా చెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో చలసాని ఆంజనేయులు విజయ డెయిరీ ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు.

## జీఐ ట్యాగ్‌తో కుప్పడం పట్టుకు గుర్తింపు

మొదటిపేజీ తరువాయి



**చీరాల, ఆగస్టు 07**

వన్ డిస్ట్రిక్ట్--వన్ ప్రొడక్ట్ ద్వారా కుప్పడం పట్టు చీరలకు విశిష్ట గుర్తింపు లభించిందని, జీఐ ట్యాగ్‌తో అమ్మకాలు 30 శాతం పెరిగాయని చేనేత కుటుంబాలు ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలిపారు. 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చీరాల నియోజకవర్గం కొత్తపేటలో 'నేతన్న సేవలో' పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన చేనేత మగ్గం యూనిట్‌ను సందర్శించి, యూనిట్ యజమాని బండారు బాలసుబ్రహ్మణ్యంతో పాటు కార్మికులతో సీఎం మాట్లాడారు.

**ఆర్థిక సాయంపై హర్షం**

చేనేతల జీవనోపాధి, సంక్షేమ పథకాల అమలుపై చేనేత వర్క్‌షాప్‌లోని కార్మికులతో సీఎం చర్చించారు. ప్రభుత్వం అందిస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఎంతో ఉపయోగపడుతోందని, రూ.25 వేల ఆర్థిక సాయం కొండంత అండగా నిలిచిందని ధనుంజయరావుతో పాటు ఇతర కార్మికులు వివరించారు. ఖాతాల్లో నగదు జమ అయినట్లు వచ్చిన సమాచారాన్ని సీఎంకు చూపించారు.

**విస్తరణ ప్రణాళికలు**

వర్క్‌షాప్ విస్తరణ ద్వారా మరిన్ని మగ్గాలు ఏర్పాటు చేసి మరింత మందికి ఉపాధి కల్పించే ప్రణాళికలను బాలసుబ్రహ్మణ్యం వివరించారు. కోవిడ్ కారణంగా నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

**నేత కార్మికులకు ప్రోత్సాహం**

మగ్గంపై చీర నేస్తున్న తీరును సీఎం ఆసక్తిగా పరిశీలించి కార్మికులను ప్రోత్సహించారు. ప్రభుత్వ సహకారంతో తమ జీవనోపాధికి భరోసా లభించిందని చేనేత కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు.

## జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో భాజపా ఒంటరిగా పోటీ:

మొదటిపేజీ తరువాయి

"తెలంగాణలో భాజపా ఎవరితోనూ పొత్తులు పెట్టుకోదు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తాం. కీలక నేతలు మా పార్టీలో చేరేందుకు సమయం కోసం వేచి చూస్తున్నారు. భాజపాలో కొత్త, పాత నేతలు అనే తేడా లేదు. తెలంగాణ ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయింది. అందరూ కలిసి పోరాటం చేయాలని నితిన్ నబీన్ దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి రోడ్ మ్యాప్ తయారు చేయాలని ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత మరోసారి ఎంపీ, ఎమ్మెల్యేలతో సమావేశం జరుగుతుంది. 937 మండలాలలో పార్టీని బలోపేతం చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, ఆరు గ్యారంటీలపై పోరాటం చేస్తాం"అని రామచందర్‌రావు తెలిపారు.

# నరుడికి నాగరికత నేర్పింది నేతన్నే

**»ప్రజా ప్రభుత్వంలో చేనేతకు మరింత గౌరవం.. నేతన్నలకు మరింత భరోసా**

**»చేనేతను ఆదరిస్తే నేతన్న కుటుంబాలకు అండగా నిలిచినట్లే**

**»వారం లో కనీసం రెండు రోజులైనా చేనేత వస్త్రాలు ధరించాలి**

**»జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో మంత్రి సీతక్క**



**హైదరాబాద్, ఆగస్టు 7: జన తెలంగాణ**

చేనేత రంగానికి మరింత గౌరవం, నేతన్నలకు నిరంతర ఉపాధి, చేనేత ఉత్పత్తులకు మరింత మార్కెట్ కల్పించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క అన్నారు. వ్యవసాయం, చేనేత రంగాలు తమ ప్రభుత్వానికి రెండు కళ్ల వంటివని ఆమె పేర్కొన్నారు. చేనేత కార్మికుల కష్టానికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు.జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న చేనేత వేడుకలకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర చేనేత అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దూడెం వెంకటరమణ, మాజీ ఎంపీ గుండు సుధారాణి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, చేనేత కళాకారులు పాల్గొన్నారు.పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన చేనేత ఎగ్జిబిషన్‌ను మంత్రి సీతక్క ప్రారంభించారు. వివిధ ప్రాంతాలకు చెందిన నేతన్నలు తయారు చేసిన చేనేత చీరలు, వస్త్రాలను ఆమె పరిశీలించారు. స్వయంగా మగ్గం నేసి నేతన్నల నైపుణ్యాన్ని తెలుసుకున్నారు. చేనేత చీరలను కొనుగోలు చేసి, ప్రజలు కూడా చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయాలని పిలుపునిచ్చారు. చేనేత కళాకారులు, ప్రముఖులను శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులకు, ముఖ్యంగా తెలంగాణ నేతన్నలు, నేతమ్మలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయం తర్వాత అధికంగా కష్టపడేది నేతన్నలేనని అన్నారు. ఒక చీర వెనుక కేవలం నూలుపోగులు మాత్రమే ఉండవని, ఒక కుటుంబం ఆశ, నేతన్న నైపుణ్యం, తరతరాలుగా వస్తున్న సంప్రదాయం ఉంటుందని చెప్పారు.నరుడికి నాగరికత నేర్పింది నేతన్నలేనని మంత్రి సీతక్క అన్నారు. మనిషి వస్త్రాన్ని నేయడం, ధరించడం ప్రారంభించినప్పుడే నాగరిక సమాజానికి నాంది పడిందని తెలిపారు. నేతన్న నూలుపోగు మన నాగరికతకు చిహ్నమని, చేనేత కేవలం ఒక వృత్తి కాదని, అది మన సంస్కృతికి ప్రతీక, సంప్రదాయానికి చిరునామా అని పేర్కొన్నారు.చేనేత రంగాన్ని కేవలం సంక్షేమ కోణంలో కాకుండా ఉపాధి, ఆర్థికాభివృద్ధి, సాంస్కృతిక పరిరక్షణ కోణంలో ప్రభుత్వం చూస్తోందన్నారు. నేతన్నల కష్టం వృథా కాకుండా నిరంతర ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

ప్రతి సంవత్సరం కోట్ల రూపాయల విలువైన ఇందిరమ్మ చీరల ఆర్డర్లను చేనేత కార్మికులకు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. దీంతో వేలాది నేత కుటుంబాలకు ఏడాది పొడవునా ఉపాధి లభిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్‌లకు అవసరమైన వస్త్రాన్ని కూడా చేనేత కార్మికుల నుంచే కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఏడాది కోట్ల మీటర్ల వస్త్రాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడం ద్వారా చేనేత రంగానికి బలమైన మార్కెట్ కల్పిస్తున్నామని తెలిపారు.గతంలో పేరుకుపోయిన నేతన్నల బకాయిలను కూడా తమ ప్రభుత్వం విడతల వారీగా చెల్లిస్తోందని సీతక్క చెప్పారు. చేనేత రంగం అభివృద్ధి, సంక్షేమం కోసం ఇప్పటికే సుమారు రూ.1,300 కోట్ల నిధులను ప్రభుత్వం వెచ్చించిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేనేతకు మరింత గౌరవం, మార్కెట్, భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.నేతన్నల చేతుల్లో నూలు చక్రం నిరంతరం తిరిగితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని మంత్రి అన్నారు. చేనేత బతికితే వేలాది కుటుంబాలు బతుకుతాయని పేర్కొన్నారు. ప్రజలంతా చేనేతకు తమ వంతు మద్దతు ఇవ్వాలని కోరారు.వారం లో కనీసం రెండు రోజులైనా చేనేత వస్త్రాలు ధరించాలని మంత్రి సీతక్క ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తాను కూడా చేనేత దుస్తులు ధరించడానికి ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. పండుగలు, శుభకార్యాలు, ప్రత్యేక సందర్భాల్లో కనీసం ఒక చేనేత వస్త్రాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. ఒక చేనేత వస్త్రాన్ని కొనుగోలు చేయడం అంటే ఒక నేత కుటుంబానికి అండగా నిలవడమేనని అన్నారు.చేనేతను ఆదరించడం అంటే మన సంస్కృతిని గౌరవించడమేనని, నేతన్నలను ప్రోత్సహించడం అంటే గ్రామీణ భారతాన్ని బలోపేతం చేయడమేనని మంత్రి సీతక్క అన్నారు. అందరం చేనేతను ఆదరించి నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపాలని పిలుపునిచ్చారు.

## 'బస్తీబాట.. పరిశీలన ఉత్తమాట' కథనంపై టీజీఎస్పీడీసీఎల్ వివరణ

**హైదరాబాద్ ఆగస్టు 7 జన తెలంగాణ**

ఈనాడు దినపత్రికలో ప్రచురితమైన "బస్తీబాట.. పరిశీలన ఉత్తమాట" కథనానికి సంబంధించి, వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేయడానికి టీజీఎస్పీడీసీఎల్ ఈ క్రింది వివరణను విడుదల చేస్తోంది.రాష్ట్ర ప్రభుత్వం, ఇంధన శాఖ ఆదేశాల మేరకు టీజీఎస్పీడీసీఎల్ రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజాబాట/బస్తీబాట' కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో అధికారులు నేరుగా బస్తీలు, కాలనీలను సందర్శించి వినియోగదారులతో ముఖాముఖి మాట్లాడుతూ, వారి సమస్యలను తెలుసుకుని, సాధ్యమైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తూ విద్యుత్ పంపిణీ వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల తనిఖీలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, జంపర్లు, ఏబీ కేబుల్స్, సర్వీస్ వైర్లు తదితర నిర్వహణ పనులు రాష్ట్రవ్యాప్తంగా నిరంతరంగా చేపడుతున్నాం. ఈ నిర్వహణ పనుల కారణంగా తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి వచ్చినప్పుడు, వినియోగదారులకు ముందస్తుగా ఆటో ప్రకటనలు, పత్రికా ప్రకటనలు, వినియోగదారుల వాట్సాప్ గ్రూపులు మరియు ఇతర సమాచార మాధ్యమాల ద్వారా సమాచారం అందజేసి, అనంతరం నిర్వహణ పనులు చేపడుతున్నాము.జీడిమెట్ల డివిజన్ పరిధిలోని 44 సెక్షనలైజర్లు ప్రస్తుతం పూర్తిస్థాయిలో సేవలందిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో క్లాంపులు అందుబాటులో లేకపోవడంతో తాత్కాలికంగా బైండింగ్ జంపర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు. అవసరమైన క్లాంపులు అందుబాటులోకి వచ్చిన వెంటనే వాటిని శాశ్వతంగా మార్చే చర్యలు చేపడతారు.అదేవిధంగా, జీడిమెట్ల సబ్‌డివిజన్ పరిధిలోని 34 ఆటో రీక్లోజర్లలో 30 పూర్తిస్థాయిలో పనిచేస్తుండగా, మిగిలిన నాలుగు ఆటో రీక్లోజర్ల మరమ్మతు పనులు ప్రణాళికాబద్ధంగా కొనసాగుతున్నాయి. ఈ కారణంగా వినియోగదారులకు విద్యుత్ సరఫరాపై ఎలాంటి ప్రతికూల ప్రభావం లేదు.తప్పుడు విద్యుత్ బిల్లుల అంశంపై కూడా కథనాల్లో వచ్చిన ప్రచారానికి సంబంధించి టీజీఎస్పీడీసీఎల్ స్పష్టీకరిస్తోంది. సూపర్‌నగర్ డివిజన్ పరిధిలోని 10 సెక్షన్లలో మొత్తం 3,29,235 మంది వినియోగదారులకు ప్రతి నెలా క్షేత్రస్థాయిలో మీటర్ రీడింగ్ నమోదు చేసి విద్యుత్ బిల్లులు జారీ చేస్తున్నారు.బిల్లులపై ఏవైనా ఫిర్యాదులు అందినట్లయితే సంబంధిత సెక్షన్ అధికారులు పరిశీలించి, అవసరమైతే ఏఏఓ/ఈఆర్‌వో స్థాయిలో నిబంధనల ప్రకారం వెంటనే సవరణలు చేపడతారు. జూలై-2026 నెలలో మొత్తం 132 ఫిర్యాదులు అందగా, వాటన్నింటినీ పరిశీలించి సకాలంలో పరిష్కరించడం జరిగింది. టీజీఎస్పీడీసీఎల్ వినియోగదారుల భద్రత, నాణ్యమైన విద్యుత్ సరఫరా, వేగవంతమైన ఫిర్యాదు పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. అసంపూర్ణ సమాచారం ఆధారంగా అపోహలకు లోనుకాకుండా, విద్యుత్ సంబంధిత సమస్యలు లేదా ఫిర్యాదుల కోసం 1912 టోల్ ఫ్రీ కాల్ సెంటర్ లేదా సంబంధిత స్థానిక విద్యుత్ అధికారులను సంప్రదించాలని టీజీఎస్పీడీసీఎల్ వినియోగదారులను కోరుతోంది.

## విజిలెన్స్,ఎసిబి అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదు

**ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్**

**హైదరాబాద్ ఆగస్టు 7 జన తెలంగాణ**

**ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆస్తులపై ఈడి విచారణ జరపాలి**

**బ్యాంకులను దోపిడీ చేస్తున్న మంచిర్యాల ఎమ్మెల్యే.**

**విజిలెన్స్,ఎసిబి అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదు?**

**రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ఆటవిక పాలన నడుస్తుంది.**

మంచిర్యాలలో మాఫియా రాజ్యం నడుస్తుంది. మరో విజయ్ మాల్యా,నీరవ్ మోడిగా మారిన మంచిర్యాల ఎమ్మెల్యే. అని 470 కోట్ల లోన్ తీసుకొని వారం రోజుల్లోనే 190 కోట్ల లోన్ ఎలా చెల్లించారో చెప్పాలి. ఐటి పార్కు పేరుతో పేదల భూములు గుంజుకుంటూ,రియల్ ఎస్టేట్ దందాలు చేస్తున్నారు. అక్రమంగా గోదావరి నుండి ఇసుక మాఫియా కొనసాగుతుంది. అక్రమంగా మట్టి రవాణా దందా నడుస్తుంది. అన్యాయంగా పేదల ఇండ్లు కూలుస్తున్నారనీ మండిపడ్డారు అయినా జిల్లా కలెక్టర్‌పోలీసు అధికారులు పట్టించుకోవడంలేదు. విజిలెన్స్ అధికారులు,మైనింగ్ అధికారులు ఒవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారు? చెరువులు కబ్జాకు గురవుతుంటే... జీవో 99 ప్రకారం,హిట్లర్ ను ఆదర్శంగా తీసుకొని రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసిన హైడ్రా ఎందుకు పనిచేయడం లేదు? రెండు వేల లంచం తీసుకున్న అధికారులను జైలుకు పంపే అవినీతి నిరోధక శాఖ అధికారులు, రెండున్నర లక్షల జీతం తీసుకునే ఎమ్మెల్యే అక్రమంగా సంపాదిస్తున్న ఆస్తుల గురించి ఎందుకు విచారణ చేయడం లేదు? అని ధ్వజమెత్తారు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు గారు 470 కోట్ల లోన్ ఎలా పొందారు.వారంలో 190 కోట్లు ఎలా చెల్లించారు? ఆ శక్తి ఎలా వచ్చింది.?నాన్ పర్ఫార్మింగ్ అసెట్స్ గా మారిన ఎమ్మెల్యేకు చెందిన కంపెనీలకు బాంబే లోని బెకాన్ కంపెనీ 140 కోట్లు ఎలా ఇచ్చింది? కేవలం 10 లక్షల విలువ గల ఊర్మిక కంపెనీకి 140 కోట్ల అప్పు ఎలా వచ్చింది? పేదలను లోన్ కోసం పోతే సిబిల్ స్కోర్, ఇల్లు,ఆస్తులు,షూరిటీలు అడుగుతారు, గ్రామాల్లో ఉఅటే ఒక ధర, పట్టణాల్లో ఉంటే ఇంకో ధర చెల్లిస్తారనీ తెలిపారు కానీ ప్రేమ్ సాగర్ గారి ఆస్తులను బ్యాంకులు ఎందుకు జప్తు చేయడంలేదు? పేమ్ సాగర్ రావు వారం లోనే 190 కోట్లు ఎలా సంపాదించారో విజిలెన్స్ అధికారులు, ఎసిబి అధికారులు విచారణ జరపాలన్నారు ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకొని, ఈడి లోతైన విచారణ జరపాలనీ రేవంత్ రెడ్డి పాలనలో కొండల్ రెడ్డి,తిరుపతి రెడ్డి కోట్ల రూపాయలు ఎలా సంపాదిస్తున్నారు.? మంచిర్యాలలో ప్రేమ్ సాగర్ రావు రోజుకు రెండు కోట్లు ఎలా సంపాదిస్తున్నారు? అని ఇంజనీరింగ్ విద్యార్థులను క్రిమినల్ వేస్ట్ అన్న రేవంత్ రెడ్డి, విద్యార్థులకు ప్రేమ్ సాగర్, కొండల్ రెడ్డి,తిరుపతి రెడ్డి దగ్గర కోచింగ్ ఇప్పించాలి. విద్యార్థులకు రోజూ కోట్ల రూపాయలు ఎలా సంపాదించవచ్చో క్లాసులు చెప్పించాలన్నారు

# సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులను అభినందించిన డీజీపీ సీవీ ఆనంద్

**»సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణకు దేశంలోనే ప్రథమ స్థానం**

**»జాతీయ ప్రగతి సమీక్షలో 9 కీలక మూల్యాంకన ప్రమాణాల్లో అగ్రస్థానం**



**హైదరాబాద్ ఆగస్టు 7 జన తెలంగాణ**

సైబర్ నేరాల నియంత్రణ, బాధితులకు న్యాయం, అత్యాధునిక సాంకేతికత వినియోగం, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి అంశాల్లో తెలంగాణ పోలీసు శాఖ మరోసారి దేశానికి ఆదర్శంగా నిలిచింది. ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ , సిపిలను, ఎస్పీలు తో పాటు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు, సిబ్బందిని అభినందించారు.

ప్రధానమంత్రి కార్యాలయం (PMO) ఆధ్వర్యంలో గురు వారం నిర్వహించిన జాతీయ ప్రగతి (PRAGATI ) సమీక్షలో సమావేశంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల సైబర్ నేరాల పనితీరును 9 కీలక మూల్యాంకన ప్రమాణాల ఆధారంగా పరిశీలించగా, తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానం సాధించింది.సైబర్ నేరాల నియంత్రణ కోసం స్టేట్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (S4C) కింద ప్రత్యేక లితెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (TGCSB)ను ఏర్పాటు చేసిన దేశంలో తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. రూ.5 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ విలువైన సైబర్ మోసాల కేసుల్లో 49 ఈ-జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తుంది. సైబర్ నేరాల ఫిర్యాదుల పరిష్కారంలో 88 శాతం, బాధితుల డబ్బు తిరిగి పొందే ప్రక్రియలో 81 శాతం పనితీరు నమోదు చేసింది. 'సహయోగ్' పోర్టల్ ద్వారా అభ్యంతరకర, నేరాలకు సంబంధించిన ఆన్‌లైన్ కంటెంట్ తొలగింపులో 88 శాతం పని తీరుతో మెరుగైన ఫలితాలను నమోదు చేసిందిఅంతర్రాష్ట్ర సమన్వయంలో 97 శాతం CIAR అభ్యర్థనలను పూర్తి చేయడంతో పాటు, 79 శాతం రాష్ట్రాల మధ్య అభ్యర్థనలను పరిష్కరించింది. అలాగే 5,500 మంది నేరస్థుల ప్రొఫైళ్లు అప్‌లోడ్ చేయగా, 15 వేల అంతర్రాష్ట్ర నేర లింకులను గుర్తించింది.మరో వైపు సైబర్ నేరాల కట్టడికి పోలీసు సిబ్బంది లో సామర్థ్య పెంపు కోసం 524 మంది అధికారులకు సైట్రెయిన్ (జమితీఖఅఅ) పోర్టల్ ద్వారా శిక్షణా సదుపాయాలు కల్పించింది. దేశవ్యాప్తంగా గుర్తించిన 15 తీవ్రమైన సైబర్ హాట్‌స్పాట్ రాష్ట్రాల జాబితాలో తెలంగాణ లేకపోవడం రాష్ట్ర సైబర్ నేరాల నియంత్రణ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోంది.పోలీసులు ప్రజల్లో సైబర్ భద్రతపై విస్తృత అవగాహన కల్పించేందుకు చేపట్టిన కార్యక్రమాల ద్వారా 8.5 లక్షల మందికి పైగా చేరుకోగా, డిజిటల్ అరెస్ట్ మోసాలపై మరో 2 లక్షల మందికి ప్రత్యేక అవగాహన కల్పించింది.సైబర్ నేరాల నియంత్రణలో దేశస్థాయిలో తెలంగాణ మరోసారి ప్రథమ స్థానం సాధించడం తెలంగాణ పోలీసు శాఖ సమిష్టి కృషికి నిదర్శనమని అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా అత్యాధునిక సాంకేతికత వినియోగంలో తెలంగాణ పోలీసు దేశానికే ఆదర్శంగా నిలవాలని, ఇదే స్థాయి పనితీరును కొనసాగిస్తూ తెలంగాణ పోలీసు గౌరవాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

## కర్ణాటక దేవదుర్గ బ్లాక్ లో బంగారం--రాగి అన్వేషణకు సింగరేణి తొలి అడుగు

**అన్వేషణ ప్రారంభానికి కర్ణాటక మైన్స్ అండ్ జియాలజీ శాఖతో ఒప్పందం**

**ఐదేళ్లలో అన్వేషణ పూర్తి చేస్తాం**

**సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ & ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు**



**హైదరాబాద్ ఆగస్టు 7, జన తెలంగాణ**

సింగరేణి సంస్థ కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్, యాదగిరి జిల్లాల్లో విస్తరించి ఉన్న దేవదుర్గ బ్లాక్ లో బంగారం, రాగి ఖనిజాల అన్వేషణలో మరో కీలక ముందడుగు వేసింది. గతంలో ఈ అన్వేషణకు కేంద్ర ప్రభుత్వ వేలంలో లైసెన్స్ పొందిన నేపథ్యంలో, ఇప్పుడు అన్వేషణ పనులు ప్రారంభించేందుకు కర్ణాటక రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ శాఖతో సింగరేణి సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది.

బెంగళూరులోని కర్ణాటక మైన్స్ అండ్ జియాలజీ శాఖ కార్యాలయంలో గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో కర్ణాటక డీఎంజీ డైరెక్టర్ రంగప్ప , సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ & ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

ఈ ఒప్పందం ప్రకారం, సింగరేణి సంస్థకు లైసెన్స్ లభించిన దేవదుర్గ ప్రాంతంలోని 199.13 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అన్వేషణను ఐదేళ్లలో పూర్తి చేయడానికి అంగీకారం కుదిరింది.ఈ సందర్భంగా డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) అండ్ ప్లానింగ్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దేవదుర్గ ప్రాంతంలోని బంగారం, రాగి ఖనిజాల అన్వేషణకు సింగరేణి గతంలోనే లైసెన్స్ సాధించిందని, ఇప్పుడు వాస్తవ అన్వేషణ కార్యక్రమం ప్రారంభించేందుకు అవసరమైన ఒప్పందం కుదిరిందన్నారు.ఇప్పటికే అధికారులను నియమించామని, త్వరలో మిగిలిన అధికారులు, సిబ్బందిని కూడా నియమించి రెండేళ్లలోపు +4 అన్వేషణను విజయవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు. ఇతర రాష్ట్రంలో ఈ స్థాయిలో ఖనిజ అన్వేషణ చేపట్టడం సింగరేణి చరిత్రలో ఇదే తొలిసారి అని పేర్కొన్న ఆయన, 13 దశాబ్దాల అన్వేషణ అనుభవం కలిగిన సంస్థగా ఈ కొత్త ప్రాజెక్టును కూడా విజయవంతంగా పూర్తి చేస్తామనే పూర్తి విశ్వాసం తమకు ఉందని తెలిపారు. ఈ సందర్భంగా సహకారం అందించిన కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి, మైన్స్ అండ్ జియాలజీ శాఖకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.అన్వేషణ కార్యక్రమంలో భాగంగా రిమోట్ సెన్సింగ్, జియోలాజికల్ మ్యాపింగ్, జియోఫిజికల్ సర్వేలు నిర్వహించి, ఎంపిక చేసిన ప్రాంతాల్లో స్కాట్ డ్రిల్లింగ్ చేపడతారు. అనంతరం సేకరించిన నమూనాలపై పెట్రోగ్రాఫిక్ మినరలాజికల్ అధ్యయనాలు నిర్వహిస్తారు. ఈ నమూనాలపై సమగ్ర మూలకాల విశ్లేషణను కొత్తగా కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన సింగరేణి జియోసైన్స్ ల్యాబొరేటరీలో చేపట్టనున్నారు. అనంతరం సమగ్ర నివేదికను కర్ణాటక మైన్స్, జియాలజీ శాఖకు సమర్పిస్తారు. ఆ నివేదిక ఆధారంగా మరింత విస్తృత స్థాయి అన్వేషణ చేపట్టే అవకాశం ఉంటుంది.కార్యక్రమంలో ఎక్స్‌ప్లోరేషన్ జీఎం పంకజ్ కుల శ్రేష్ట, డీజీఎం (జియాలజీ) వి.రాజేశ్వర్, డీవైఎఫ్ఎం లక్ష్మీప్రియ, సీనియర్ లా ఆఫీసర్ ప్రభందిత తదితరులు పాల్గొన్నారు.

–చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్

# సంక్షోభాలను అవకాశాలను మల్చుకోవాలి...

**అప్పుడే పరిశ్రమలు మరింత బలోపేతం అవుతాయి: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**పాలిమర్ రంగానికి ప్రభుత్వం అండగా ఉంటుంది...**

**సమస్యలపై సమగ్ర ప్రతిపాదనలు ఇవ్వండి**




**హైదరాబాద్, ఆగస్టు 7: జన తెలంగాణ**

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక, భౌగోళిక రాజకీయ అనిశ్చితులను సవాళ్లుగా కాకుండా కొత్త అవకాశాలుగా మలుచుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. సంక్షోభ సమయాల్లోనే కొత్త సాంకేతికత, నాణ్యత, ఆవిష్కరణలపై పెట్టుబడులు పెట్టే పరిశ్రమలే భవిష్యత్తులో మార్కెట్‌ను శాసిస్తాయని అన్నారు. పరిశ్రమల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన హిప్లెక్స్--2026 (HIPLEX--Hyderabad International Plastics Expo-2026) ప్లాస్టిక్స్, పాలిమర్స్, ప్రాసెసింగ్ టెక్నాలజీ, యంత్రాల అంతర్జాతీయ ప్రదర్శనను మంత్రి ప్రారంభించి ప్రసంగించారు.పరిశ్రమల ప్రదర్శనల్లో తనకు యంత్రాలు మాత్రమే కనిపించవని, వాటి వెనుక వేలాది కుటుంబాల జీవనోపాధి, దేశాభివృద్ధికి కృషి చేస్తున్న పారిశ్రామికవేత్తల సంకల్పం, యువత భవిష్యత్తు కనిపిస్తాయని మంత్రి పేర్కొన్నారు. ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా పెట్టుబడులు, విస్తరణ, ఆవిష్కరణలను కొనసాగిస్తున్న పరిశ్రమల ఆత్మవిశ్వాసమే భారతదేశ బలమని అన్నారు.పాలిమర్ రంగం దేశ తయారీ రంగానికి వెన్నెముకప్లాస్టిక్స్, పాలిమర్ పరిశ్రమ దేశ తయారీ రంగంలో అత్యంత కీలకమైందని మంత్రి తెలిపారు. గృహనిర్మాణం, తాగునీటి సరఫరా, వ్యవసాయం, వైద్యరంగం, ఔషధ తయారీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఆహార ప్రాసెసింగ్, మౌలిక సదుపాయాల రంగాలకు అవసరమైన ముడి పదార్థాలను ఈ రంగమే అందిస్తోందన్నారు.దేశవ్యాప్తంగా ఈ పరిశ్రమ ద్వారా 50 లక్షల మందికి ప్రత్యక్షంగా, కోటికి పైగా మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తోందని, తెలంగాణలోనే సుమారు రెండు లక్షల మంది జీవనోపాధి ఈ రంగంపై ఆధారపడి ఉందని వివరించారు. పాలిమర్ రంగం అభివృద్ధి చెందితే తయారీ రంగం విస్తరిస్తుందని, దాంతో ఉపాధి అవకాశాలు పెరిగి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని చెప్పారు.

**మందగమనం తాత్కాలికమే... పరిశ్రమల ధైర్యం శాశ్వతం**

గత ఆర్థిక సంవత్సరంలో పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల, పాలిమర్ ధరల అస్థిరత, రవాణా, విద్యుత్ వ్యయాల పెరుగుదల, కార్మికుల కొరత వంటి అంశాలు పరిశ్రమపై ప్రతికూల ప్రభావం చూపాయని మంత్రి పేర్కొన్నారు. దేశ జీడీపీ వృద్ధికి సమాంతరంగా అభివృద్ధి చెందే పాలిమర్ రంగం గత ఏడాది కేవలం 2.4 శాతం వృద్ధిని మాత్రమే నమోదు చేసిందన్నారు. పీవీసీ పైపులు, హెచ్‌డీపీఈ పైపులు, ఆటోమొబైల్ రంగాలకు సంబంధించిన ఉత్పత్తుల్లో మందగమనం కనిపించినప్పటికీ పరిశ్రమల్లో విశ్వాసం ఏమాత్రం తగ్గలేదని అన్నారు.హిప్లెక్స్--2026కు లభించిన విశేష స్పందనే దేశ పారిశ్రామిక రంగం భవిష్యత్తుపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. చరిత్ర చెబుతున్నదేమిటంటే... సంక్షోభ సమయాల్లోనే గొప్ప పరిశ్రమలు ఆవిర్భవిస్తాయని వ్యాఖ్యానించారు.

**సమగ్ర ప్రతిపాదనలు ఇవ్వండి. ప్రభుత్వం పరిశీలిస్తుంది**

పరిశ్రమలతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని శ్రీధర్ బాబు తెలిపారు.

విధానపరమైన సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. పరిశ్రమలతో నిరంతర సంప్రదింపులే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు.

**పాలిమర్ రంగంలోనూ తెలంగాణకు అగ్రస్థానం**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ దేశంలోనే పెట్టుబడులకు అత్యంత అనుకూల రాష్ట్రంగా ఎదిగిందని మంత్రి పేర్కొన్నారు.



## ఇకపై ప్రయోగాలు చేస్తా!: కాజోల్

మహిళల్ని కేవలం సహాయక పాత్రలకే పరిమితం చేయకుండా.. వారికి సినిమాలో మరింత కీలకమైన పాత్ర పోషించే అవకాశాన్ని కల్పిస్తున్నారని అంటోంది బాలీవుడ్ నాయిక కాజోల్. అప్పట్లో ఎన్నో ప్రేమకథలతో హిందీ ప్రేక్షకుల్ని అలరించిన ఈమె.. ఈ మధ్య ఓటీటీ వేదికగా కూడా సందడి చేస్తుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కాజోల్ మాట్లాడుతూ.. "నాకు నచ్చిన ప్రాజెక్ట్‌లను, ఆ పాత్రల ద్వారా ఏదైనా ప్రత్యేకంగా చేయగలనని అనిపించే పాత్రలనే ఎప్పుడూ ఎంచుకున్నాను. ఆ విషయంలో ఇప్పటికీ ఎలాంటి మార్పు లేదు. కానీ ఇకపై ప్రయోగాలు చేయాలనుకుంటున్నా. కొత్త కోణాల్ని ప్రయత్నించాలని, మునుపెన్నడూ చేయని కథల్లో భాగం కావాలని అనుకుంటున్నా. ఏదైనా పాత్ర విషయంలో నాకు నమ్మకం కలగకపోతే ఆ సినిమా చేయను. నచ్చకపోతే వెంటనే నో చెప్పేస్తా" అని అంది. "మహిళా ప్రాధాన్య కథల విషయంలో మనం ఇప్పుడు సరైన దిశలో పయనిస్తున్నాం. ఇది వారిని మంచి కోణంలో చూపిస్తుందో లేదో తెలియదు కానీ.. మహిళలపై కచ్చితంగా ఎక్కువ దృష్టి పడుతోంది. వారి కోసం మంచి పాత్రలను రాస్తున్నార"ని చెప్పుకొచ్చింది కాజోల్.



## కొకులు తల్వార్‌లు పడితే..!

'ది ప్యారడైజ్' సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయకుడు నాని. 'దసరా' విజయం తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో కలిసి ఆయన చేస్తున్న ఈ రెండో సినిమాని సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. కయాదు లోహర్ కథానాయిక. మోహన్‌బాబు, రాఘవ్ జుయల్, సంపూర్ణేశ్ బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబరు 24న రానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. "ఇగ నుంచి ఈ జాగ ఎవరిదీ.. ఈ దేశం ఎవరిదీ" అంటూ జడల్‌గా నాని చెప్పే డైలాగ్‌తో మొదలైన టీజర్ ఆద్యంతం హింస, రక్తపాతంతో యాక్షన్ కోణంలో ఆసక్తికరంగా సాగింది. అణగదొక్కబడిన ఓ జాతికి హీరో నాయకుడైతే.. కాకుల్లా ఛీ అనిపించుకున్న తన సమూహంతో కలిసి పోరుకు సిద్ధమైతే ఎలా ఉంటుందన్నది ఈ ప్రచార చిత్రంలో ఆసక్తికరంగా చూపించారు. దీంట్లో జడల్‌గా నాని మేకోవర్.. తన పాత్రని చూపించిన విధానం.. ఎలివేషన్లు.. అన్నీ ఆకర్షణగా నిలిచాయి. మోహన్‌బాబు వింటేజ్ లుక్‌లో ఆకట్టుకున్నారు. "తూ అనిపించుకున్న కాకులు తల్వార్‌లు పడితే ఏమైతదో చూపిద్దాం" అంటూ టీజర్ ఆఖర్లో నాని చెప్పిన డైలాగ్ హైలైట్‌గా నిలిచింది.

## ప్రముఖ దర్శకులు వేణు ఉడుగుల చేతుల మీదుగా "స్టువర్టుపురం స్టూడెంట్స్" ట్రైలర్ విడుదల

## నవ్వులే నవ్వులు.. 'కొరియన్ కనకరాజు'కు మెగాస్టార్ విషెస్



'కొరియన్ కనకరాజు' అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చి థియేటర్‌లలో సందడి చేస్తున్నారు వరుణ్ తేజ్. ఆయన ప్రధానపాత్రలో మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా టీమ్‌కు అగ్రకథానాయకుడు చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు. వరుణ్‌ను అభినందించారు.'ఈ సినిమాకు వస్తోన్న స్పందనలు చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది. ఎక్కడ విన్నా 'నవ్వులే నవ్వులు' అనే మాటే వినిపిస్తోంది. వరుణ్ తేజ్ ఈ విజయాన్ని అందుకోవడానికి అర్హుడు. నీ కష్టానికి, నిబద్ధతకు తగిన ప్రతిఫలం దక్కింది. గొప్ప విజయాన్ని సొంతం చేసుకున్న టీమ్‌కు శుభాకాంక్షలు. త్వరలోనే ఈ సినిమా చూస్తాను. బ్లాక్‌బస్టర్ హిట్ కావాలని కోరుకుంటున్నా" అని చిరంజీవి పోస్ట్ పెట్టారు.ఇక వరుణ్‌ను మాస్ పాత్రలో చూడడం తనకెంతో ఇష్టమని ఆయన భార్య లావణ్య త్రిపాఠి అన్నారు. "ప్రతి సినిమాను ప్రాణంపెట్టి చేస్తావు. 'కొరియన్ కనకరాజు' నీ ప్రయాణంలో మరో మైలురాయిగా నిలిచిపోతుంది. నిరంతరం కొత్త జానర్లను అన్వేషించాలనే అంకితభావమే నిన్ను ఇంత అద్భుతమైన నటుడిగా నిలబెట్టింది" అని వరుణ్‌కు విషెస్ చెప్పింది.

### » బిగ్ బాస్ ఫేమ్ దివి యాక్షన్ అండ్ డాన్స్ హైలెట్ గా తెరకెక్కిన చిత్రం



**జన తెలంగాణ సినిమా**

శివ సాయి ప్రొడక్షన్స్ పతాక పై డి. నిరీక్షణ సమర్పణలో, నిఖిల్, దివి ప్రధాన పాత్రలో డి. రామకృష్ణ దర్శకత్వంలో నిర్మాతలు ప్రవీణ్ కుమార్ శ్రీనివాస్ రెడ్డి నిర్మిస్తున్న ఎమోషనల్ యాక్షన్ ఎంటర్టైనర్ "స్టువర్టుపురం స్టూడెంట్స్." 80% షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటుంది. కాగా ఈ చిత్ర ట్రైలర్ ను ప్రముఖ దర్శకులు వేణు ఉడుగుల లాంచ్ చేశారు. ట్రైలర్ తో పాటు ఆయన సాంగును కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా వేణు ఉడుగుల మాట్లాడుతూ "స్టువర్టుపురం స్టూడెంట్స్ ట్రైలర్ చూశాను .అలాగే సాంగ్స్ కూడా చూశాను. చాలా బాగున్నాయి.ఈ సాంగ్, ఈ ట్రైలర్ నా చేతుల మీదుగా రిలీజ్ చేయటం సంతోషంగా ఉంది. ట్రైలర్ చాలా బాగుంది . ఎస్పెషల్లీఈ చిత్రంలో దివి చేసిన యాక్టింగ్ కూడా చాలా ఇన్నోవేటివ్ గా ఉంది. అలాగే డైరెక్టర్ ఆర్కే గారు ఈ చిత్రాన్ని చాలా లావిష్ గా తెరకెక్కించారని అనిపిస్తుంది .ఈ సినిమా డెఫినెట్ గా హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. అని అన్నారు.చిత్ర దర్శకుడు రామకృష్ణ మాట్లాడుతూ" మా సినిమా ట్రైలర్ విడుదల కోసం అడిగిన వెంటనే కాదనకుండా తన ఆఫీస్ కు పిలిపించుకుని మా ట్రైలర్ను సాంగ్ ను ఆవిష్కరించిన దర్శకులు వేణు ఉడుగుల గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. అలాగే ముఖ్యంగా మా టెక్నికల్ టీమ్ ఎంతో సహకరించి నన్ను ముందుకు నడిపినందుకు వారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఈ సినిమా 80% పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్నాము. సినిమాని అతిత్వరలో మీ ముందుకు తీసుకొస్తున్నామని ఆశిస్తున్నాను. అని అన్నారు.బిగ్ బాస్ ఫేమ్ హీరో నిఖిల్ మాట్లాడుతూ స్టువర్టుపురం స్టూడెంట్స్ నాకు ఒక ప్రత్యేకమైన సినిమా, నన్ను డైరెక్టర్ రామకృష్ణ గారు ఒక కమర్షియల్ హీరోగా నిలబెట్టేందుకు బాగా కష్టపడ్డారు. డెఫినిట్గా ఈ చిత్రం నాకు మంచి కమర్షియల్ హీరోగా గుర్తింపునిస్తుంది .దీనికి కారకుడైన మా డైరెక్టర్ ఆర్కే గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. అన్నారు.హీరోయిన్ దివి మాట్లాడుతూ మేము అడిగిన వెంటనే ఎంతో రెస్పెక్ట్ ఇచ్చి మా ట్రైలరు సాంగ్ ని రిలీజ్ చేసిన వేణు ఉడుగుల గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.ఈ సినిమా విషయానికి వస్తే నేను చాలా లక్కీ అని చెప్పాలి, మా డైరెక్టర్ గారు చాలా బాగా కథ రాసుకొని ఈ సినిమాను చాలా డిఫరెంట్ గా తెరకెక్కించారు. నాకు ఈ సినిమాలో ఓ సాంగ్ ఉంది ఆ సాంగ్లో నేను భరతనాట్యం చేస్తాను , బెల్లియు డాన్స్ చేస్తాను ,అలా డిఫరెంట్ వే లో ఉంటుందా సాంగ్. అలాగే నాకంటే ఈ సినిమాకలో నిఖిల్ ఎక్కువ స్కోపు ఉన్న క్యారెక్టర్ చేశారు.డెఫినెట్గా ఈ సినిమా మా అందరికీ మంచి నేమ్ తెస్తుందని ఆశిస్తున్నాను. అని అన్నారు .

నిఖిల్, దివి , శ్రావణ్ ,హైపర్ ఆది, రమణారెడ్డి, వేణు సమీరా , అఖిల్,తదితరులు నటించిన ఈ చిత్రానికి

లిరిక్స్: కె .కల్పన మాణిక్ ,

## 'డిసి'తో లోకేష్ కనగరాజ్ హీరోగా బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్నారు. సినిమా బాగుంటే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని 'డిసి' మరోసారి నిరూపించింది. ఇంత మంచి విజయాన్ని అందించిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు: సక్సెస్ మీట్‌లో నిర్మాత సురేష్ బాబు

**జన తెలంగాణ సినిమా**

లోకేష్ కనగరాజ్ లేటెస్ట్ బ్లాక్ బస్టర్ 'డిసి'. లోకేష్ కనగరాజ్ హీరో గా పరిచయమైన ఈ చిత్రాన్ని అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ నిర్మించింది. వామికా గబ్బి, సంజనా కృష్ణమూర్తి హీరోయినన్స్ గా నటించారు. అనిరుధ్ సంగీతం అందించారు. ఆగస్టు 7న ఏషియన్ సినిమాస్ ద్వారా ఈ చిత్రం తెలుగులో గ్రాండ్ గా విడుదలై అద్భుతమైన రెస్పాన్స్ తో ఘన విజయాన్ని అందుకుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్మించారు.ప్రెస్ మీట్ లో నిర్మాత సురేష్ బాబు మాట్లాడుతూ.."అందరికీ నమస్కారం. 'డీసీ' సినిమాకు వస్తున్న రిపోర్ట్స్ అద్భుతంగా ఉన్నాయి. సన్ పిక్చర్స్‌కు ధన్యవాదాలు. ఏషియన్ సునీల్ , దిల్ రాజు మేమంతా కలిసి ఈ సినిమాను డిస్ట్రిబ్యూట్ చేశాం. లోకేష్ కనగరాజ్ పెద్ద దర్శకుడు. ఇప్పుడు మొదటిసారి హీరోగా నటించారు. అద్భుతమైన పెర్ఫామెన్స్ ఇచ్చారు. సినిమా అద్భుతమైన రెస్పాన్స్‌తో ప్రారంభమైంది. అన్ని వైపుల నుంచి పాజిటివ్ రివ్యూలు వస్తున్నాయి. హై రేటింగ్స్ వస్తున్నాయి. చాలా గొప్ప టెక్నికల్ వాల్యూస్‌తో రూపొందిన సినిమా ఇది. టెక్నికల్‌గా సినిమా చాలా బ్రిలియంట్‌గా ఉంది. సినిమా బాగుంటే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనేది ఈ సినిమా మరోసారి నిరూపించింది. అరుణ్ మాథేశ్వరన్ అద్భుతంగా తెరకెక్కించారు. వామికా గబ్బి, మిగతా నటీనటులు కూడా చాలా బాగా నటించారు. ప్రతి షోకి ఆదరణ పెరుగుతోంది. ఇంత మంచి విజయాన్ని అందించిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ప్రేక్షకులు చాలా తెలివైనవారు. ట్రైలర్ చూసే సినిమా ఎలా ఉంటుందో అర్థం చేసుకుంటారు. కొత్తదనం కనిపిస్తే తప్పకుండా థియేటర్‌కు వస్తారు. అనిరుధ్ అందించిన సంగీతాన్ని ప్రేక్షకులు థియేటర్లలో ఎంతో ఎంజాయ్ చేస్తున్నారు. లోకేష్ గారు, అనిరుధ్ గారు, దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ వచ్చే వారం హైదరాబాద్‌కు వస్తారు. అప్పుడు గ్రాండ్ సక్సెస్ మీట్ కూడా నిర్వహిస్తాం.నిర్మాత సునీల్ నారంగ్ మాట్లాడుతూ: అందరికీ నమస్కారం. ముందుగా ఈ సినిమా హక్కులు మాకు ఇచ్చిన సన్ పిక్చర్స్‌కు ధన్యవాదాలు. 'డీసీ' అన్ని చోట్ల విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఇది బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ఇంత గొప్ప విజయాన్ని అందించిన ప్రేక్షకులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. అలాగే భవిష్యత్తులో రాబోతున్న 'జైలర్ 2' కూడా పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది."నిర్మాత శిరీష్ రెడ్డి మాట్లాడుతూ: ఇంత గొప్ప విజయాన్ని అందించిన తెలుగు ప్రేక్షకులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సినిమా హక్కులు మాకు ఇచ్చి మమ్మల్ని ప్రోత్సహించిన సన్ పిక్చర్స్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. అన్ని ప్రాంతాల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. స్క్రీన్స్ కూడా పెరుగుతున్నాయి. ఈ విజయం మాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది.

## 'కొరియన్ కనకరాజు'కు మేము ఊహించిన దానికంటే అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వుతూ సినిమాను ఎంజాయ్ చేస్తున్నారు. ఇంత గొప్ప విజయాన్ని అందించిన ప్రేక్షకులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు: సక్సెస్ ప్రెస్ మీట్‌లో మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్

**జన తెలంగాణ సినిమా**

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ లేటెస్ట్ బ్లాక్ బస్టర్ 'కొరియన్ కనకరాజు'. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మించాయి. ఆగస్టు 6న జరిగిన ప్రీమియర్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఆగస్టు 7న వరల్డ్ వైడ్ థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ హౌస్ ఫుల్ కలెక్షన్స్ తో రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సక్సెస్ సెలబ్రేషన్ నిర్వహించారు. ప్రెస్ మీట్ లో హీరో వరుణ్ తేజ్ మాట్లాడుతూ.. "నిన్న సాయంత్రం ప్రీమియర్స్ నుంచి వచ్చిన రెస్పాన్స్ చూసి చాలా ఆనందంగా అనిపించింది. మొదటి నుంచి ఈ సినిమాపై మాకు పూర్తి నమ్మకం ఉంది. కానీ మేము ఊహించిన దానికంటే అద్భుతమైన స్పందన ప్రేక్షకుల నుంచి వచ్చింది. ప్రేక్షకులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. సినిమాలోని ప్రతి ఎపిసోడ్‌ను ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు. సత్య కామెడీకి మంచి రెస్పాన్స్ వస్తోంది. రానున్న రోజుల్లో సినిమా ఇంకా గొప్ప ముందుకు వెళ్తుంది. శిరీష్ గారు ఎడిటింగ్ దశలోనే సినిమా చూసి, 'మీరు మంచి సినిమాతో వస్తున్నారు' అని మాకు ఎంతో కాన్ఫిడెన్స్ ఇచ్చారు. ఆయన నమ్మకం ఈరోజు నిజమైంది. ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వుకోవాలని ఈ సినిమా చేశాం. ఇప్పుడు థియేటర్లలో వాళ్లు అలా ఎంజాయ్ చేస్తుంటే అంతకంటే ఆనందం ఇంకేముంటుంది. తమన్‌తో పాటు మా టెక్నికల్ టీమ్ మొత్తం ఒక కుటుంబంలా కలిసి పని చేసింది. బాబు పుట్టిన తర్వాత ఈ సక్సెస్ రావడం నాకు మరింత స్పెషల్‌గా అనిపిస్తోంది. దర్శకుడు మేర్లపాక గాంధీ మాట్లాడుతూ: నాకు కావాల్సిన హిట్ 'కొరియన్ కనకరాజు'గా వచ్చింది. మొదటి నుంచి వరుణ్ తేజ్ గారు ఈ సినిమాకు బ్యాక్‌బోన్‌లా నిలబడి ప్రతి విషయంలో అండగా ఉన్నారు. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'ఎక్స్‌ప్రెస్ రాజా' తర్వాత ప్రేక్షకులు థియేటర్లలో ఇంతగా నవ్వుతూ ఎంజాయ్ చేయడం మళ్లీ ఈ సినిమాతో చూడడం చాలా ఆనందంగా ఉంది. వరుణ్ తేజ్ గారి కటౌట్‌కు తగ్గ సినిమా ఇది. కనకరాజు, కొరియన్ పాత్రల్లో ఆయన అద్భుతంగా నటించారు. సత్యతో ఆయన కాంబినేషన్ ప్రేక్షకులను బాగా అలరిస్తోంది. రితిక కూడా తన పాత్రను చాలా చక్కగా చేసింది. నిర్మాత రాజీవ్ రెడ్డి గారు సినిమాను అద్భుతంగా తెరకెక్కించడానికి ఎంతో కష్టపడ్డారు. శిరీష్ గారి సపోర్ట్‌కు కూడా ప్రత్యేకంగా థ్యాంక్స్. ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన మాకు చాలా ఆనందాన్ని ఇస్తోంది. హీరోయిన్ రితిక నాయక్ మాట్లాడుతూ: తెలుగు ప్రేక్షకులు ఇస్తున్న ప్రేమ, ఆదరణకు చాలా ఆనందంగా ఉంది. ప్రీమియర్స్ సమయంలో థియేటర్‌లో ప్రేక్షకులు సినిమాను హిలేరియస్‌గా ఎంజాయ్ చేయడం చూసి చాలా సంతోషం వేసింది. వరుణ్ తేజ్ గారికి, సత్య గారికి, మా దర్శకుడు గాంధీ గారికి, నిర్మాతలకు హృదయపూర్వక ధన్యవాదాలు. మేమంతా నమ్మి చేసిన ఒక మంచి ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకులు కూడా అదే స్థాయిలో ఆదరిస్తుండటం చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమాలో భాగం

Published at H.NO. 1-107/3, PALAKURTHIVILLAGE, RAMAGUNDAM DIST, KARIMNAGAR TELANGANA Editor: R. CHAITANYA, RNI NO. TELTEL/2014/61071 Cell: 9701676775